# గ్రామీణ క్రీడలతో నైపుణ్యాలకు పదును

## ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

పెదనందిపాడు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలతో నైపుణ్యాలకు పదును పెట్టవచ్చునని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. వైఎస్సార్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో విజేతలకు శనివారం రాత్రి బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి తగిన ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. మొదటి బహుమతిని ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశింపీరా రూ.లక్ష, రెండవ బహుమతి ఏబీ పాలెం సొసైటి అధ్యక్షుడు కే భూషయ్య రూ.50,000, మూడో బహుమతి ఎంపీ అక్వా మేనేజర్ దాసరి బుల్లిబాబు రూ.30,000 అందజేశారు. మొదటి స్థానం కాకుమాను, రెండో స్థానం బాపట్ల, మూడో స్థానం హైదరాబాద్, నాలుగో స్థానం చెన్నయ్, ఐదో స్థానం బేతపూడి జట్లు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ టి.హెప్సిబా, వైస్ ఎంపీపీలు షేక్ ఖాశింబి, కే సాంబశివరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశింపీరా, కె.కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు మాలతి, సుందర్, సర్పంచులు దాసరి పద్మారావు, ఎస్.సురేష్, నరసింహారావు పాల్గొన్నారు.



విజేత కాకుమాను జట్టు కు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

# టూరిస్ట్ ప్రదేశంగా గాంధీ హిల్

పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని గాంధీ హిల్ టూరిస్ట్ ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం ఒన్‌టౌన్‌లోని రూ.80 లక్షలతో పునరుద్ధరీకరణ జరుగుతున్న గాంధీ హిల్ అభివృద్ధి పనులను, నక్షత్ర ప్రదర్శనశాలను శనివారం నగర కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇటీవల అభివృద్ధి చేసిన ప్లానిటోరియం లోపల సీట్లను, నక్షత్రాలు, గ్రహాలు ఇతర ఖగోళ వస్తువుల చిత్రాలను ప్రదర్శించే స్క్రీన్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. గాంధీ పర్వతం ఒక టూరిస్ట్ ప్రదేశంగా ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ గాంధీ కొండ చుట్టూ తిరిగే ట్రైన్, గ్రంథాలయం, లైటింగ్ సౌండ్ సిస్టం, పిల్లలకు ఆకర్షణీయంగా ఉండేలా ఆట పరికరాల ఏర్పాటు వంటి అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. పర్యటనలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, డెప్యూటీ సిటీ ప్లానర్ ప్లానింగ్ జుబిన్ శిరస్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు పాల్గొన్నారు.



గాంధీ హిల్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

## క్లుప్తంగా

### గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**కోనేరుసెంటర్:** మచిలీపట్నంలోని రుద్రవరం గురుకుల పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ తెలిపారు. 6, 7, 8, 9 తరగతుల సీట్లు భర్తీ చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని సూచించారు. రాత పరీక్ష అనంతరం స్పాట్ అడ్మిషన్లు ఇస్తామన్నారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల దరఖాస్తులను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల రుద్రవరంలో ఇవ్వాలని కోరారు. విద్యార్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలని స్పష్టం చేశారు. రాత పరీక్షకు సంబంధించిన సమాచారాన్ని తల్లిదండ్రుల ఫోన్ నంబరుకు మెసేజ్ రూపంలో పంపిస్తామని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 9010416707 నంబరులో సంప్రదించాలన్నారు.

### సత్తా చాటిన స్విమ్మర్లు



**విజయవాడ స్పోర్ట్స్:** రాష్ట్ర స్థాయి సీనియర్ స్త్రీ, పురుషుల స్విమ్మింగ్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు సత్తా చాటారు. గాంధీనగర్‌లోని సర్ విజ్జి మునిసిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో శనివారం పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 117 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 16 గోల్డ్, 16 సిల్వర్, నాలుగు బ్రాంజ్ మెడల్స్‌తో ఎన్టీఆర్ జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మొదటి స్థానంలో నిలవగా ఏడు గోల్డ్, ఆరు సిల్వర్, నాలుగు బ్రాంజ్ మెడల్స్‌తో విశాఖపట్నం జిల్లా రెండో స్థానంలో, మూడు గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్‌తో నెల్లూరు జిల్లా మూడో స్థానం సాధించాయి. విజేతలకు ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.గోవిందరాజు, కార్యదర్శి ఎ.మోహన్‌వెంకటరామ్, శాప్ స్విమ్మింగ్ కోచ్ నటరాజారావు ట్రోఫీలు అందజేశారు. స్విమ్మింగ్ పూల్ ఇన్‌చార్జ్ బి.రాంబాబు, ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఐ.రమేష్, కోచ్‌లు ఎం.తులసీచైతన్య, మాల్యాద్రి, లక్ష్మణ్, రఫీ పాల్గొన్నారు.

### 13న మినీ జాబ్‌మేళా

**చిలకలపూడి/గన్నవరం:** ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా ఈ నెల 13వ తేదీన మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలోని మేధా టవర్స్ ఆవరణలోని ఫస్ట్ సోర్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ కంపెనీలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని 18 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగి డిప్లొమో, ఏదైనా డిగ్రీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు వారి బయోడేటా, సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు కాపీలతో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు రూ. 14 వేలు వేతనం ఇస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9666615539, 9494005725 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### ముగిసిన శిక్షణ



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** డిగ్రీ స్థాయిలో ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన జరగాలనే ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించిన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలకు చెందిన 42 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఐఐటీ, అన్నా యూనివర్సిటీ తదితర ప్రముఖ యూనివర్సిటీ ప్రొఫెసర్‌లు రిసోర్స్ పర్సన్‌లుగా పాల్గొని అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు.

### స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

**మొగల్రాజపురం(విజయవాడతూర్పు):** ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొ ల్యూషన్స్, ప్లంబర్ కోర్సుల్లో విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోనే శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సర్టిఫికెట్‌ను అందజేస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 0866-2475575, 7780429468, 9182534259 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### నిమ్మకాయల ధరలు

**తెనాలిటౌన్:** తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1100, గరిష్ట ధర రూ.2200, మోడల్ ధర రూ.1500 వరకు పలికింది.

# జల సం‘రక్షణ’

‘ఒక్క నీటిబొట్టు ఒడిసిపడితే ఒదిగిపోతానంది / విడిచిపెడితే వినాశనమే అంది’ అని పెద్దల మాట. వరుణుడు విడిచిపెట్టే ప్రతి నీటిబొట్టు మనకు మేలు చేకూర్చేదే. కానీ దాన్ని జాగ్రత్తగా ఒడిసిపట్టుకోవాలి. అందుకే ‘నీరు తరిగే నిధి / పదిలపరచుకోవడం మన విధి’ అని చెబుతారు. ‘జలమే కదాని వృథా చేస్తే రేపటి తరాలకు మిగిలేది కన్నీరే’నని సుద్దులు చెబుతారు. అసలు ‘నీరు ఉంటేనే ఏ జీవి అయినా సజీవం / లేదంటే సమస్త ప్రపంచం నిర్జీవమేనంటారు’ భాషా ప్రేమికులు. అంతెందుకు, నీటిని పొదుపు చేసే విషయంలో పెద్దలు ఇంట్లో పిల్లలకు నేటికీ ఇలా చెబుతుంటారు.. ‘మాట పొదుపు చేస్తే మీకు మేలు / ధనం పొదుపు చేస్తే పిల్లలకు మేలు / నీరు పొదుపు చేస్తే జగతికి మేలు’ అని. అదే ఆచరించి చూపిస్తోంది జగనన్న ప్రభుత్వం.

- శ్రీకారం చుట్టిన జగనన్న ప్రభుత్వం
- పొలాల్లోనే నేలబావులు, నీటికుంటల తవ్వకాలు
- ఉపాధి పథకం నిధులతో నిర్వహణ
- సన్న, చిన్నకారు రైతులకు మేలు
- ఉపాధి వేతనదారులకు పనుల కల్పన



యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో తీసిన సేద్యపుకుంట (ఫైల్)

**యడ్లపాడు:** వర్షం నీరు వృథాగా పోనివ్వకుండా దానిని సేద్యపు అవసరాలకు వినియోగించుకునేలా చేయాలని ప్రభుత్వం భావించింది. ఒకప్పుడు పొలాల్లో ఎక్కువగా నేలబావులు, నీటికుంటలు ఉండేవి. వేసవిలో సైతం ఈ నీటి వనరులతో కూరగాయలు, అపరాలు, చిరుధాన్యాలు పండించే వారు. ఇప్పుడు ఏ పొలంలోనూ నీటి వనరుల ఛాయలు కనిపించడం లేదు. జలసంరక్షణలో భాగంగా భూగర్భ జలాలు పెంపొందించేందుకు వీటిని మళ్లీ కొత్తగా తవ్వించాలని ప్రభుత్వం పూనుకుంది. ఇప్పటికే అమృత్‌సర్ పథకం ద్వారా చేపట్టిన చెరువులు సుందరీకరణ పనుల్లో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు చెరువు పూడికతీత, కట్టల బలోపేతం, వాటిపై మొక్కల పెంపకం వంటి పనులు చేపట్టింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాలు సైతం ఈచెరువు గట్లపై నిర్వహించి స్వాతంత్ర్య సమరయోధుల్ని స్మరించాలని నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి కొత్తగా పంటపొలాల్లో నేల బావులు, సేద్యపు నీటి కుంటలను తవ్వించాలని, దానికి అవసరమైనవన్నీ ఉపాధి హామీ నిధులు కేటాయించాలని భావించారు. ఇందుకోసం ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలో సన్న, చిన్నకారు రైతులతో పాటు ఉపాధిహామీ వేతనదారుకు ప్రయోజనం చేకూరనుంది. వేసవిలో వివిధ పంటకు ఉపయోగపడతాయి. ఫలితంగా భూమిలో నీటిమట్టం కూడా పెరుగుతుంది.

**ఉమ్మడి గుంటూరు జిల్లాలో...**

నీటిమట్టం తగ్గుముఖం ఉన్న , మండలాల్లో గ్రామాలో మెట్టభూముల్లో సేద్యపు నేలబావులు, నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 34 మండలాలు, 258 గ్రామాలు ఎంపిక చేసింది. దీంతో గుంటూరు జిల్లాలో 11 మండలాలు, 106 గ్రామాలు, బాపట్ల జిల్లాలో 7 మండలాలు, 68 గ్రామాలు, పల్నాడు జిల్లాలో 16 మండలాలు, 84 గ్రామాలు ఉన్నాయి.

**సన్న, చిన్నకారు రైతులకు మేలు**

5 ఎకరాలలోపు భూమి కలిగిన సన్న, చిన్నకారు రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన రైతులు లిఖిత పూర్వకంగా రాసి, భూమి సర్వేనెంబర్, వివరాల పత్రాలు అందించాలి. మండలస్థాయి అధికారులు వాటికి అంచనాలు రూపొందించి జిల్లా అధికారులకు నివేదిస్తారు. పరిశీలన అనంతరం అర్హత కలిగి ఉంటే పదిరోజుల్లోనే మంజూరవుతుంది. వెనువెంటనే పనులు నిర్వహించుకోవచ్చు.

**సేద్యపు బావులు**

18 అడుగులు వ్యాసార్థం, 48 అడుగు లోతులో నిర్మించాలి. ఈ పనులను ఉపాధి కూలీలు మాత్రమే చేయాల్సి ఉంటుంది. బావి లోతు 6 అడుగులు దాటిన తరువాత మట్టిని తోడే యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. తవ్వేటప్పుడు నీరు పడితే 5 గంటల పాటు ఆయిల్ ఇంజిన్‌ను పెట్టి తోడేయవచ్చు. అలాగే పైభాగాన మట్టిపెడ్డలు పడి పూడిపోకుండా 3 అడుగుల రాతి లేదా కాంక్రీట్‌తో రక్షణ గోడ నిర్మించుకోవచ్చు. కూలీల వేతనం, మెటీరియల్ కాంపొండ్ కింద కలిపి ఇందుకు రూ.5 లక్షల వరకు నిధులు వెచ్చిస్తారు. సేద్యపు కుంటలు.. పూర్తిస్థాయి వేతనదారులతోనే తీయిస్తారు. 5-5 మీటర్ల పొడవు వెడల్పు 2 మీటర్ల లోతు కుంటలకు రూ.50 వేలు, 10-10 మీటర్ల పొడవు వెడల్పు 2 మీటర్లలోతు కుంటలకు రూ.లక్ష, 15-15 మీటర్ల పొడవు వెడల్పు 2 మీటర్ల లోతు కుంటలకు రూ.1.50 లక్షలు, 20-20 మీటర్ల పొడవు వెడల్పు 2 మీటర్ల లోతు కుంటలకు రూ.2 లక్షలు చెల్లిస్తారు.

### ఎంత మందికైనా ఇస్తాం



రైతులు ముందుకు వస్తే మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మండల స్థాయి ఉపాధి అధికారులు, సిబ్బంది పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పథకానికి రైతులు ఎప్పుడైనా, ఎంత మంది రైతులైనా దరఖాస్తు చేసుకోవచ్చు. వర్షాలు పడకముందే ఈ పనులు పూర్తియ్యేలా ప్రణాళిక చేసుకోవాలి.

– జి జోసఫ్‌కుమార్, డ్వామా పీడీ పల్నాడు జిల్లా



జలసిరితో సేద్యపు నీటికుంట (ఫైల్)

### దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్



ఎమ్మెల్యే కోన రఘుపతిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం సభ్యులు

**బాపట్ల అర్బన్:** దివ్యాంగుల కమిటీని ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కోన రఘుపతికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాల మేరకు బాపట్ల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం పట్టణ, మండలాల నూతన కమిటీల అధ్యక్షుల జాబితాను శనివారం పూర్తి చేసినట్లు రామయ్య తెలిపారు. 2024లో తిరిగి ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కోన రఘుపతిని ఎన్నుకుంటామన్నారు. ప్రతి గ్రామానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సీఎం జగనన్న పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. నూతన దివ్యాంగుల కమిటీలో బాపట్ల పట్టణ అధ్యక్షుడిగా సలగల కుమార్, బాపట్ల మండల అధ్యక్షుడిగా కుక్కల సుబ్బారెడ్డి, కర్లపాలెం మండల అధ్యక్షుడిగా మద్దిబోయిన శ్రీనివాసరావు, పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ ఖాన్‌లను ఎన్నుకోవటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతిని ఘనంగా సన్మానించారు.

శాకంబరీదేవి ఉత్సవాలు

# ఘనంగా నిర్వహిస్తాం

- దుర్గగుడి చైర్మన్, ఈవో
- 19 నుంచి ఆషాఢ మాసోత్సవాలు
- జూలై 1 నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు
- జూలై 2న దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం



మాట్లాడుతున్న దుర్గగుడి చైర్మన్ రాంబాబు, చిత్రంలో ఈవో భ్రమరాంబ

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఈ ఏడాది భక్తులు, దాతల సహకారంతో శాకంబరీదేవి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. దుర్గగుడి మహా మండపం ఆరో అంతస్తులో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శాకంబరీదేవి ఉత్సవాలు, ఆషాఢ మాసోత్సవాల వివరాలను చైర్మన్, ఈవో, వైదిక కమిటీ సభ్యులు వివరించారు. రాంబాబు మాట్లాడు తూ పాలక మండలి వచ్చిన తర్వాత తొలి సారిగా శాకంబరీదేవి ఉత్సవాలను జూలై ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉత్సవాలకు రైతులు, వ్యాపారులు, భక్తులు కూరగాయలు, కాయగూరలు, పండ్లు అందచేస్తారని పేర్కొన్నారు. భక్తులు, నగర ప్రజలను మరింత భాగస్వామ్యం చేస్తామన్నారు. భక్తులు విరివిగా అమ్మవారికి కూరగాయలు సమర్పించి రశీదు పొందాలని కోరారు. ఈ నెల 19వ తేదీ నుంచి జరిగే ఆషాఢ మాసోత్సవాల్లో అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సారె సమర్పించే భక్తులు ముందుగా దేవస్థాన టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈవో భ్రమరాంబ మాట్లాడుతూ ఆషాఢ మాసోత్సవాల్లో తొలి రోజున ఆలయ వైదిక కమిటీ సభ్యులు అమ్మవారికి సారె సమర్పిస్తారని వెల్లడించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో రైతుల ఇంట సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి శాకంబరీదేవి ఉత్సవాలు నిర్వహిస్తామని ఈవో వివరించారు. తెలంగాణ నుంచి జూలై 2వ తేదీన అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తారని చెప్పారు. పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ, ఆలయ ఈఈ కోటేశ్వరరావు ఉన్నారు.

### ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ కార్యవర్గం ఎన్నిక

**కృష్ణలంక(విజయవాడతూర్పు):** ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్ల జాయింట్ యాక్షన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో చైర్మన్‌గా కుమ్మరకుంట సురేష్, కో చైర్మన్లుగా కల్లూరి శ్రీనివాస్, లామా పద్మారావు, పి.సాయిరాజు, ఎం.రామకృష్ణ, తదితర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో జూన్ 2, 2014 నాటికి సర్వీస్‌లో ఉన్న ప్రతి కాంట్రాక్ట్ లెక్చరర్‌ను రెగ్యులర్ చేయాలని కోరారు. ఐదేళ్ల సర్వీసు నిబంధనను రద్దు చేయాలన్నారు.

# హోరాహోరీగా బాక్సింగ్ పోటీలు





విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న దృశ్యం

**విజయవాడ స్పోర్ట్స్:** ఐదోవ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల బాక్సింగ్ పోటీలు విజయవాడ ఆంధ్రా లయోల కాలేజీలో శనివారం హోరాహోరీగా జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల బాలికల విభాగంలో 60 పాయింట్లు, 10 గోల్డ్ మెడల్స్‌తో విశాఖపట్నం జిల్లా మొదటి స్థానంలో, 18 పాయింట్లు, రెండు గోల్డ్, రెండు సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్‌తో నెల్లూరు జిల్లా రెండో స్థానాన్ని దక్కించుకుంది. బాలుర విభాగంలోనూ విశాఖపట్నం జిల్లా 42 పాయింట్లు, ఏడు గోల్డ్ మెడల్స్‌తో మొదటి స్థానంలో నిలవగా, శ్రీకాకుళం జిల్లా 24 పాయింట్లు, నాలుగు గోల్డ్ మెడల్స్‌లో రెండో స్థానాన్ని దక్కించుకుంది. బాలికల విభాగంలో బెస్ట్ బాక్సర్‌లు ఎస్.దుర్గాస్మృతిశ్రీ(విశాఖపట్నం), ఎ.నసీమ (శ్రీకాకుళం), బాలుర విభాగంలో బెస్ట్ బాక్సర్‌లుగా పి.సుబ్రహ్మణ్యం (విశాఖపట్నం), డి.ప్రవీణ్ (శ్రీకాకుళం) నిలిచారు. విజేతలకు ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్ ఏసీపీ ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి, సెంట్రల్ ఏసీపీ పి.భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం, సీఈవో శశికాంత్, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్‌దేవ్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వై.వి.ఎస్. ఉమామహేశ్వరరావు ట్రోఫీలు అందజేశారు. కేవీఆర్ ట్రావెల్స్ అధినేత నాగరాజు, వ్యాపారవేత్త అమర్‌నాథ్, సురక్షా బ్రెడ్ బ్యాంక్ సెంటర్ అధినేత సురేష్, శాయ్ కోచ్ డి.ఎస్.వి.వినాయక ప్రసాద్ టోర్నీకి స్పాన్సర్‌లుగా వ్యవహరించారు.

### పోలీసుల అదుపులో మహిళ హత్య కేసు నిందితుడు

**పట్నంబజారు(గుంటూరు):** మహిళను హత్య చేసిన కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈనెల 9న నల్లచెరువు మూడోలైనులో జరిగిన ననావత్ భారతీబాయి (43) హత్య కేసులో నిందితుడు ప్రతాప్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన భారతీబాయి 20 ఏళ్ల కిందట భర్తను వదిలేసి గుంటూరు వలస వచ్చింది. దాసరిపాలెంలోని రాజీవ్‌గృహకల్ప ప్లాట్స్‌లో నివాసం ఉంటూ ఇద్దరు పిల్లలకు వివాహం చేయగా, ప్రస్తుతం మూడో కుమారుడు శివశంకర్‌నాయక్‌తో కలిసి నల్లచెరువులో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గత ఐదు సంవత్సరాలుగా మార్కెట్ యార్డులో కూలిగా పనిచేసే భారతీబాయి ప్రతాప్‌రెడ్డితో సహజీవనం సాగిస్తుంది. ఈ మధ్యకాలంలో ప్రతాప్‌రెడ్డిని భారతీబాయి దూరంగా పెడుతున్నట్లు అనుమానం పడుతున్న నిందితుడు కొద్దికాలంగా ఈ విషయమై ఆమెతో గొడవ పడుతున్నాడు. మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉందని అనుమానం పెంచుకున్న ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఇంట్లో ఉన్న ఆమెను కత్తితో గొంతు కోసి, మొహంపై పొడిచి రక్తపుమరకలు ఉన్న చొక్కాను వదిలేసి పరారయ్యాడు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో వినుకొండ పరిసర ప్రాంతాల్లో ప్రతాప్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అధికారికంగా అరెస్టు చూపించనున్నట్లు సమాచారం.

# పోర్టు నిర్మాణంతో జిల్లా ప్రగతి పథం

ఎంపీ వల్లభనేని బాలశౌరి



జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణలో ఎంపీ బాలశౌరి, వేదికపై ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తదితరులు

**పమిడిముక్కల:** బందరు పోర్టు నిర్మాణంతో జిల్లా ప్రగతి పథంలో పయనిస్తుందని, దేశానికి మణిహారంగా నిలుస్తుందని ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. మండలంలోని మామిళ్లపల్లి శివారు గండ్రపువానిగూడెంలో ఏర్పాటు చేసిన మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాన్ని ఎంపీ వల్లభనేని బాలశౌరి, శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బాలశౌరి మాట్లాడుతూ దేశాభివృద్ధికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ రెండు కళ్లు లాంటివారని చెప్పారు. ఆ నేతల జీవితాలను యువతకు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎందరో నాయకులు పోర్టు నిర్మాణం చేస్తామని హామీలిచ్చి శిలాఫలకాలకే పరిమితమయ్యారని విమర్శించారు. బందర్ పోర్టుతో జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందనుందని పేర్కొన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రభుత్వం దేశంలోనే మరెక్కడా లేదన్నారు. రానున్న కాలంలో మరిన్ని నిధులు రాబట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. మామిళ్లపల్లి- గండ్రపువానిగూడెం రహదారి అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**జగనన్న పాలనలో సంక్షేమం...**

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న పాలనలో ఇంటింటా సంతోషం నెలకొందన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధికి నోచుకోని మారుమూల గ్రామాల్లో సైతం పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న ఎంపీ బాలశౌరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీలు కాసాని వేదసుప్రజ, కొండేటి ఇందిర, దాసరి అశోక్‌కుమార్, సర్పంచ్‌లు ఆముదాలపల్లి సుబ్రమణ్యం, కోట మణిరాజు, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచలి గణేష్, ఎంపీటీసీ జురువు రపు శృతి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘరానా దొంగ అరెస్ట్

840 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.20 లక్షల నగదు స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని

**విజయవాడ స్పోర్ట్స్:** విజయవాడ నగరంలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను జిల్లా పోలీస్ యంత్రాంగం అదుపులోకి తీసుకుంది. గతంలోనూ పలు దొంగతనాలకు పాల్పడి, జైలు జీవితం అనుభవించిన నిందితుడు యథావిధిగా చోరీ వృత్తినే కొనసాగిస్తున్నాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ విశాల్‌గున్ని వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. గుణదల ఆదర్శనగర్‌లోని ఓ ఇంట్లో ఈ నెల ఏడో తేదీన చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న తన ఇంట్లోకి చొరబడి బీరువాలోని 54 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదు చోరీ చేశారని ఇంటి యజమాని గుణదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాలతో క్రైం ఏడీసీపీ పి.వెంకటరత్నం నేతృత్వంలో గుణదల సీఐ పి.కృష్ణమోహన్, పటమట సీఐ డి.కాశీవిశ్వనాథ్, పోలీస్ కానిస్టేబుళ్లు ప్రతాప్, కిషోర్, అబ్దుల్‌రషీద్, ఆరిఫ్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలించారు. ఘటనా స్థలంలో సేకరించిన ఆధారాలు ఆర్ఆర్‌పేటకు చెందిన పాత నేరస్తుడు కోన నాగదుర్గామోహన్‌కు సరిపోలడంతో నిందితుడిని శనివారం అదుపులోకి తీసుకుని విచారించారు. గతంలో పలు చోరీలకు పాల్పడిన దుర్గామోహన్ పలు కేసుల్లో అరెస్టయి గత నెల 28న జైలు నుంచి విడుదలయ్యాడు. జైలు నుంచి వచ్చిన వెంటనే పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడు. గుణదల ఆదర్శనగర్‌లోని గృహంతో పాటు రామవరప్పాడు రింగ్ ఫ్లై ఓవర్ వద్ద ఓ దుకాణంలో దొంగతనానికి పాల్పడ్డానని, పటమటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీకి విఫలయత్నం చేశానని నిందితుడు విచారణలో అంగీకరించినట్లు డీసీపీ విశాల్‌గున్ని తెలిపారు. నిందితుడి నుంచి 840 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.20 లక్షల నగదును స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు.

# రౌడీషీటర్ వద్ద 21 కిలోల గంజాయి స్వాధీనం



రౌడీషీటర్ నాగూర్ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ హనుమంతరావు, సీఐ శ్రీను

**ఇబ్రహీంపట్నం:** విజయవాడకు చెందిన రౌడీషీటర్ షేక్ నాగూర్ బాషాను ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో వెస్ట్‌జోన్ ఏసీపీ కె.హనుమంతరావు నిందితుడి వివరాలు శనివారం మీడియాకు వెల్లడించారు. సీఐ పి.శ్రీనుకు వచ్చిన సమాచారం మేరకు దొనబండ వద్ద తిరుగుతున్న షేక్ నాగూర్‌ను అదుపులోకి తీసుకోగా అతని వద్ద 21 కిలోల గంజాయి లభించింది. ఈ ఏడాది మార్చి 4న కొండపల్లి శాంతినగర్‌లో స్నేహితుని పుట్టినరోజు సందర్భంగా 13 మంది వ్యక్తులు గంజాయి తాగుతూ పోలీసుల కంటపడ్డారు. అప్పట్లో 12 మందిని అరెస్ట్ చేయగా 13వ వ్యక్తి తప్పించుకుని పారిపోయాడు. అతను నాగూర్ బాషాగా ఇప్పుడు గుర్తించారు. అతనిపై వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసుల్లో రౌడీషీట్ ఉందన్నారు. గ్రామాల్లో గంజాయి రవాణా, విక్రయాలు జరిపితే 100కు ఫోన్ చేయాలని ఏసీపీ తెలిపారు.

**గంజాయి ప్యాకెట్లతో ముగ్గురు అరెస్టు**

**విస్సన్నపేట:** గంజాయి ప్యాకెట్లు కలిగి ఉన్న 17 నుంచి 20 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక రెడ్డిగూడెం రోడ్డులో వైన్‌షాపు పక్కన ఖాళీ స్థలంలో అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అటుగా వెళుతున్న ఎస్ఐ జీవీవీ సత్యనారాయణ, సిబ్బంది వారిని శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ ఎం.రమేష్ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విస్సన్నపేటకు చెందిన పోలిమెట్ల సుభాష్, పరసం వేణుసాయి, గంట అరుణ్‌తేజలను అదుపులోకి తీసుకొని వారి వద్ద 1,100 గ్రాములు గల మూడు గంజాయి పొట్లాలు, ఒక బైక్ స్వాధీన పర్చుకున్నారు. సుభాష్ స్నేహితుడు రెడ్డిగూడెం మండలం ముచ్చెనపల్లి గ్రామానికి చెందిన గంట జీవన్ అనే అతని ద్వారా అప్పుడప్పుడు గంజాయి కొనుగోలు చేస్తున్నారు. అతను అందుబాటులో లేకపోతే అతని బాబాయి కొడుకు అరుణ్‌తేజ గంజాయి తెచ్చి ఇచ్చేవాడని, ఇదే క్రమంలో ఈ రోజు ఉదయం సుభాష్, వేణుసాయి గంజాయి కావాలని జీవన్‌ను అడగగా అతను రెడ్డిగూడెం మండలం ముచ్చెనపల్లి గ్రామం వెళ్లే ఊరి బయట కాలువ దగ్గరకు రమ్మని చెప్పగా బైక్‌పై వెళ్లారన్నారు. అక్కడకు జీవన్, అరుణ్‌తేజ వచ్చి మూడు ప్యాకెట్లు గంజాయి ఇచ్చారు. అనంతరం జీవన్ వెళ్లిపోగా, అరుణ్‌తేజ వీరిద్దరితో కలసి విస్సన్నపేటలోని రెడ్డిగూడెం రోడ్డులో గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లు చేసి అమ్ముకుందామని ఆలోచిస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. జీవన్ పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామన్నారు. యువత మత్తుపదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకో వద్దన్నారు. గంజాయికి అలవాటు పడ్డవారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. గంజాయితో యువకులను పట్టుకున్న ఎస్ఐ జీవీవీ సత్యనారాయణకు, సిబ్బందిని ఏసీపీ అభినందించి రివార్డులు ఇచ్చారు. సమావేశంలో సీఐ ఆర్.భీమరాజు పాల్గొన్నారు.



### అన్నదానానికి రూ.లక్ష విరాళం

పెనుగంచిప్రోలు:తిరుపతమ్మ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బాపట్ల జిల్లా పర్చూరుకు చెందిన కోటా శ్రీనివాసరావు, వెంకటరత్నం రూ.లక్ష విరాళం ఇచ్చారు.



### స్వామి వారికి వెండి వస్తువులు

మోపిదేవి: కృష్ణాజిల్లా మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి చిలకలూరిపేటకు చెందిన సోమేపల్లి హర్షవర్ధనాదేవి శనివారం కిలో వెండి వస్తువులు సమర్పించారు.



### దుర్గమ్మ సేవలో....

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు.

## న్యూస్‌రీల్

### గ్రూప్‌-1 పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ



గుంటూరురూరల్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి శనివారం తనిఖీ చేశారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరుతెన్నులపై చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాధికను అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు జరిగిన పరీక్షలకు 692 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 521 మంది హాజరయ్యారని వివరించారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ నుంచి పరీక్ష నిర్వాహకులు, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటలక్ష్మి, సెక్షన్ అధికారులు రమణ, గిరిజ, పరీక్షల సమన్వయ అధికారి పాల్గొన్నారు.

### రేపు విద్యాకానుక కిట్లు పంపిణీ

గుంటూరుఎడ్యుకేషన్: నూతన విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయనున్నట్లు డీఈఓ పి.శైలజ శనివారం తెలిపారు. క్రోసూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జేవీకే కిట్ల పంపిణీని సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో అదే రోజు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జేవీకే కిట్లు పంపిణీ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యుల సమక్షంలో స్థానిక ప్రజాప్రతినిధులచే విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేయించాలని పేర్కొన్నారు.

### డీవైఈఓ వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా పి.వెంకటేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి బదిలీపై వచ్చి, డీఈఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావును కలిసిన ప్రధానోపాధ్యాయులు ఎ.తిరుమలేష్, జి.శ్రీనివాసరావు, ఎస్.ఉషాకుమారి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం, ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ మేనేజర్ వి.వజ్రబాబు అభినందనలు తెలియజేశారు. డీవైఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి, ప్రభుత్వం అందజేస్తున్న వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. సమష్టి కృషితో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరుస్తామని తెలిపారు.

### స్పందన తాత్కాలికంగా రద్దు

బాపట్లఅర్బన్: ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### జీజీహెచ్‌లో డైట్ టెండర్లు రద్దు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు, డ్యూటీ వైద్యులకు భోజనం వడ్డించే కాంట్రాక్టు దక్కించుకున్న టెండర్లను రద్దు చేశారు. హైదరాబాద్‌కు చెందిన సహస్ర సంస్థ మార్చినెలలో డైట్ టెండర్లు దక్కించుకుంది. డైట్ టెండర్లలో పాల్గొన్న గత కాంట్రాక్టర్ కోడూరి సురేష్ హైకోర్టులో టెండర్ల ప్రక్రియపై ఫిర్యాదు చేశారు. సహస్ర సంస్థకు అర్హత లేకపోయినా జీజీహెచ్ డైట్ టెండరు అప్పగించారని సంస్థ వారు సమర్పించిన డాక్యుమెంట్లు సరైనవి కాదని కోర్టులో ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు జీజీహెచ్ అధికారులు ఈనెల 3న సహస్ర సంస్థ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి పదిరోజుల్లోగా జీజీహెచ్ డైట్‌ను ఖాళీ చేసి వెళ్లాలని ఆదేశించారు.

# రికార్డు ఉపాధి

**గడిచిన రెండునెలల్లో రూ.100 కోట్ల ఉపాధి హామీ పనులు**

- 2.28 లక్షల మందికి ఉపాధి
- సగటున రోజుకు ఒక్కొక్కరికి రూ.240
- 4 వేల పనులు పూర్తి
- వివిధ దశల్లో 41 వేల పనులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అవసరమైన వారందరికీ ఆర్థికంగా చేయూతనందించేందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లాలో పెద్దఎత్తున ఉపాధి హామీ పనులు కల్పిస్తుంది. గతేడాది కంటే మిన్నగా ఈ ఏడాది పనులను చేపట్టింది. ఇందుకోసం డ్వామా విభాగం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా గడిచిన రెండు నెలల్లో జిల్లాలో రికార్డు స్థాయిలో రూ. 100 కోట్ల పనులను పూర్తిచేశారు. వేతనాల కింద కూలీలకు రూ. 88.62 కోట్లు చెల్లించారు. మెటీరియల్ కింద రూ. 13 కోట్లు ఖర్చుచేశారు. ఇప్పటికే 300 కుటుంబాలు 100 రోజుల పనిదినాలు పూర్తిచేసుకున్నాయి. సగటున కూలీలకు రోజుకు రూ. 240 కూలి వచ్చింది.

**4వేల పనులు పూర్తి...**

గడిచిన రెండు నెలల్లో జిల్లావ్యాప్తంగా 4వేల పనులను పూర్తిచేశారు. మరో 41 వేల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 73 లక్షల పనిదినాలు కల్పించాలన్నది లక్ష్యం కాగా కేవలం రెండు నెలల్లోనే 38.50 లక్షల పనిదినాలు (53శాతం) కల్పించడం గమనార్హం. ఉపాధిలో 56 శాతం మహిళలకు పనులు కల్పించగా 37 శాతం ఎస్సీలకు, 3.7 శాతం ఎస్టీలకు పనులు కల్పించారు.

**రాబోయే రోజుల్లో రూ. 200 కోట్లతో పనులు..**

రాబోయే పదినెలల్లో మరో రూ. 200 కోట్ల పనులు చేపట్టాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పనులను సకాలంలో పూర్తిచేస్తే ప్రభుత్వం మెటీరియల్ కాంపోనెంట్ కింద మరో రూ.160 కోట్లు మంజూరు చేయనుంది. ఈ నిధులతో జిల్లావ్యాప్తంగా సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

**జరుగుతున్న పనులు ఇలా...**

ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రభుత్వం జిల్లాలో పలు అభివృద్ధి పనులను చేపట్టింది. చెరువుల పూడికతీత కట్టల ఆధునికీకరణ, తూముల రిపేర్లు, పీడర్, ఫీల్డ్ చానల్స్ ఆధునికీకరణ, ఫామ్‌పాండ్స్ నిర్మాణం, పండ్ల తోటల పెంపకం కోసం పిట్లు తీయడం, తదితర పనులను చేపట్టారు. పండ్ల తోటల పెంపకానికి సంబంధించి 500 ఎకరాలు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 300 ఎకరాల పరిధిలో పిట్లు తవ్వారు. చివరి ఆయకట్టు సాగునీరు అందించేందుకు ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల పనులను చేపట్టారు. 100 రోజుల పనిదినాలకు గానూ కూలీలకు ఇప్పటి వరకు సగటున 29 రోజులు పనిదినాలు కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు తప్పనిసరిగా పని దినాలు పూర్తిచేసేలా పనులు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఉపాధి హామీ పనుల ద్వారా భూగర్భజలాలు పెంపొందించి భవిష్యత్తులో మనుష్యులతోపాటు పశుపక్షిజాతులకు నీటి సమస్య రాకుండా చూడటం లక్ష్యం. 70 శాతం నీటినిల్వ పనులు చేపడుతున్నారు. అమృతసరోవర్‌లో భాగంగా భూముల ఆధునికీకరణ పనులను పూర్తిచేస్తున్నారు.

**రికార్డు స్థాయిలో ఉపాధిపనులు**



అన్నివర్గాల ప్రజలకు ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. గతంలో కంటే మిన్నగా పనులు కల్పిస్తున్నాం. రెండు నెలల్లో రూ. 100 కోట్ల పనులు పూర్తిచేశాం. రాబోయే పది నెలల్లో మరో రూ. 200 కోట్ల పనులు చేయబోతున్నాం. నీటి సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలకు అందరికీ ఉపాధి పనులు కల్పించడమే లక్ష్యం.

– శంకర్‌నాయక్, డ్వామా పీడీ

# ఆణిముత్యాలుకు ప్రోత్సాహం

**పాఠశాలస్థాయిలోనూ జగనన్న ఆణిముత్యాలు**

- సర్కారు పాఠశాలల్లో చదివిన టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహం
- నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్కారంతోపాటు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ
- జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముగ్గురేసి చొప్పున టాపర్లకు నగదు ప్రోత్సాహకాల పంపిణీకి ప్రభుత్వ ఉత్తర్వులు
- రేపటి నుంచి 19 వరకు పాఠశాల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహణ
- ప్రజా ప్రతినిధుల సమక్షంలో నిర్వహించాలని హెచ్‌ఎంలకు డీఈఓ ఆదేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో పాఠశాలస్థాయిలో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులకు సైతం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా నగదు ప్రోత్సాహకాలను అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గతనెలలో విడుదలైన 10వ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థులను నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఎంపిక చేసిన ప్రభుత్వం వారిని 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో సత్కరించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం విదితమే. ఈ విధంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వారీగా టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన తొలి ముగ్గురు టాపర్లకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను ఇవ్వనున్నారు. జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో 23 మంది టెన్త్ విద్యార్థులతో పాటు ఇంటర్మీడియెట్‌లో 15 మంది విద్యార్థులు ఉన్నారు. వీరితో పాటు ప్రతి ఒక్క ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిధిలో టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో తొలి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపిక చేసి వారికి వరుసగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున అందించేందుకు నిర్ణయిస్తూ పాఠశాల విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది. ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు నుంచి వారం రోజుల వ్యవధిలో టెన్త్ టాపర్లను పాఠశాలకు పిలిచి, ప్రజా ప్రతినిధుల సమక్షంలో వారికి నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా ఈనెల 15న నియోజకవర్గ, 17న జిల్లా, 20న రాష్ట్రస్థాయిలో నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేయనున్నారు.

**అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలి**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించాలి. పాఠశాల పరిధిలో స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి, వారి సమక్షంలో విద్యార్థులను సన్మానించి, ప్రభుత్వం అందజేస్తున్న నగదు ప్రోత్సాహకాన్ని వారికి పంపిణీ చేయడంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.

– పి.శైలజ, గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి

## హజ్‌యాత్రకు బయల్దేరిన 170 మంది భక్తులు

పెదకాకాని: పవిత్ర హజ్ యాత్ర ఆనందంగా సాగాలని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బద్వేలు షేక్ గౌసల్ ఆజామ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రకు నాలుగో రోజు శనివారం బయలుదేరిన 170 మంది ప్రయాణికులను ఆప్యాయంగా పలకరిస్తూ సాగనంపారు. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలంలోని నంబూరులో సిరాజుల్ ఉలూం మదరసాలో ఏర్పాటయిన తాత్కాలిక హజ్ హౌస్ నుంచి ఈనెల 7వ తేదీ నుంచి ప్రతిరోజు హజ్ యాత్రకు భక్తులు బయలు దేరి వెళుతున్నారు. హజ్ యాత్రికుల బస ఏర్పాటు చేసిన మదరసాలోనే వారి ప్రయాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టారు. యాత్రికుల ప్రయాణం ఆనందంగా సాగాలని స్వీట్లు, సామగ్రి అందజేశారు. హజ్ కమిటీ సభ్యులు ఇబాదుల్లా, పుంగనూరు ఖాదర్, హఫీజ్ మన్సూర్, వక్ఫ్‌బోర్డు అధికారులు, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు సయ్యద్ సుభాని, మదరసా నిర్వాహకులు పాల్గొన్నారు.

# సర్కారు బడిలో 'టెక్నో' బోధన

**రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్**

- గుంటూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సందర్శన
- ఐఎఫ్ ప్యానెల్స్ పనితీరును ఉపాధ్యాయులకు ప్రత్యక్షంగా చూపిన ప్రవీణ్ ప్రకాష్



ఐఎఫ్ ప్యానెల్‌ను పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్, పక్కన జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరుఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో టెక్నాలజీ ఆధారిత విద్యాబోధనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు కోసం ఖర్చుకు వెనుకాడకుండా నిధులు కేటాయిస్తున్నారని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. నాడు–నేడు మొదటి దశలో రూ.49 లక్షల వ్యయంతో పాఠశాలను ఆధునికీకరించిన తీరు, వసతుల కల్పనను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు ఆధునిక విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటుచేసిన తరగతి గదులను సందర్శించిన ప్రవీణ్ ప్రకాష్ వాటి పనితీరు, వినియోగించే విధానంపై ఉపాధ్యాయులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. రూ.1.26 లక్షల విలువ కలిగిన ఒక్కో ఐఎఫ్‌పీని ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు స్మార్ట్‌గా పాఠాలను బోధించడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాంకేతిక విజ్ఞానాన్ని ప్రత్యక్షంగా చూపించవచ్చని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్ ప్యానల్స్ ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాడు–నేడు ద్వారా సకల వసతులను కల్పించిన ప్రభుత్వం, ప్రపంచంతో పోటీ పడుతూ ఆధునిక విద్యాబోధన అందించేందుకు ఐఎఫ్ ప్యానెల్స్‌ను పాఠశాలల్లో ఏర్పాటు చేసిందన్నారు. ఐఎఫ్‌పీల ద్వారా ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో బోధన అందించేందుకు ఉపాధ్యాయులు సైతం స్మార్ట్‌గా సన్నద్ధం కావాలని సూచించారు. విద్యార్థి కేంద్రంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులను కల్పిస్తున్న ప్రభుత్వ చిత్తశుద్ధి, ఆశయాలను గుర్తించి అందుకు అనుగుణంగా విద్యాబోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

**ఐఎఫ్ ప్యానెల్స్ వినియోగంపై ప్రత్యక్ష అవగాహన..**

ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలల్లోని తొమ్మిది తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్స్‌ను పరిశీలించిన ప్రవీణ్ ప్రకాష్ వాటి పనితీరు గురించి ఉపాధ్యాయులతో నేరుగా సంభాషించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రం ఏపీ అని ప్రవీణ్ ప్రకాష్ పెన్నుతో స్వయంగా రాశారు. పాఠశాలలో వసతులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈఓ పి.శైలజ, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం బి.విజయలక్ష్మి, ఎంఈఓ బలిరాం ఉన్నారు.

# ఊహాకందని రీతిలో సాగు

- కంద సాగుకు మొగ్గుతున్న రైతాంగం
- సుమారు 4వేల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది అదనంగా మరో 500 ఎకరాల్లో..
- చీడపీడల భయం ఉండదంటున్న రైతులు



కంద దుంపను భూమిలో విత్తేందుకు అనువుగా కోస్తున్న కూలీలు



కంద సాగుకు భూమిని దున్ని సిద్ధం చేసే పనిలో రైతు

కొల్లూరు: వాణిజ్య పంటల సాగుకు నిలయమైన కృష్ణా తీరంలో కర్షకులు ముమ్మరంగా కంద సాగు చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు. కంద సాగుకు మే చివరి వారం నుంచి జూన్ నెల అనువైన సమయం అవడంతో రైతాంగం సాగు పనిలో తలమునకలవుతున్నారు. బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, గుంటూరు జిల్లాలోని కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో ప్రతి ఏటా సుమారు 4 వేల ఎకరాల వరకు రైతులు కంద పంట పండిస్తున్నారు. ఈ సీజన్‌లో మరో 500 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

**లాభాలపై ఆశాభావం..**

గత సీజన్‌లో కంద దిగుబడులు ఆశించిన రీతిలో రావడం, రైతులకు మంచి ధర లభించడంతో కర్షకులు తిరిగి ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఎకరం పొలంలో 20 పుట్లు (పుట్టుకు 225 కిలోలు) కంద విత్తనం అవసరం అవగా, విత్తనపు కంద సుమారు పుట్టు రూ.4,500 నుంచి రూ.5 వేలు వెచ్చించి కొనుగోలు చేసి నాటుతున్నారు. ఎకరాకు విత్తనానికి రూ.లక్ష, దుక్కులు, కూలీల ఖర్చుకు మరో రూ. 20 వేలతో పంట సాగు చేపడుతున్నారు. ఆరు నెలల కాల వ్యవధిలో చేతి కందే ఈ పంట ఆశించిన రీతిలో దిగుబడులు లభించడంతోపాటు, తగిన ధరలు లభిస్తే లాభాలు సాధించవచ్చన్న ఆశాభావం రైతులు వ్యక్తం చేస్తున్నారు.

**అంతరాష్ట్రాలకు విరివిగా ఎగుమతి**

పలు రకాల వంటకాలతో పాటు, చట్నీలు, ఔషధాలలో విరివిగా వినియోగించే కంద దుంపను కృష్ణా డెల్టాలోని లంక గ్రామాల నుంచి పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ముంబయి, కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రదేశాలకు తరలుతున్న కంద సాగులో పురుగుమందులు చల్లాల్సిన అవసరం లేకపోవడం, చీడపీడలు ఆశించే ప్రమాదం తక్కువగా ఉండటంతో రైతులు సాగుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీనితోపాటు అంతరపంటలు సాగు చేసుకునే అవకాశం ఉండటంతో తక్కువ పెట్టుబడితో రెండు పంటలు ఏకకాలంలో పండించి లాభాలు పొందుతున్నారు. అంతరపంటలుగా మొక్కజొన్న, అరటి, బొప్పాయి వంటి పంటల సాగు చేపడుతున్నారు. ఇతర వాణిజ్య పంటలైన అరటి, పసుపు వంటి పంటలతో పోల్చుకుంటే విత్తనపు ఖర్చు మినహా పెట్టుబడి తక్కువగా ఉండటంతో కర్షకులు కంద సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సాగు ఆరంభ సమయంలో అయ్యే పెట్టుబడులు మినహా.. ఆరునెలల వ్యవధిలో సకాలంలో సాగు నీరు అందించడం మినహా పెట్టుబడులు వెచ్చించే అవసరం లేకపోవడంతో రైతులు లాభసాటి పంటగా భావిస్తున్నారు. గత సీజన్‌లో ఈ ప్రాంతంలో రైతులు పండించిన కందకు పుట్టు (225 కిలోలకు) రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు రేటు లభించడంతో ఈసారి రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టారు.

**ఎకరాకు 70 - 80 పుట్ల దిగుబడి..**

నవంబర్, డిసెంబర్ మాసాల్లో చేతికందే కంద పంట ఎకరాకు సుమారు 70 నుంచి 80 పుట్లు వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇదేవిధంగా దిగుబడి బాగా వస్తే లాభాలు పొందవచ్చునన్న భావన రైతుల్లో వ్యక్తమవుతుంది.

**చీడపీడల భయం ఉండదు**



కంద సాగు చేపట్టేందుకు రైతులు అధికంగా శ్రమపడాల్సిన అవసరం ఉండదు. ఇతర వాణిజ్య పంటలతో పోల్చుకుంటే ఈ పంటకు చీడపీడలు సోకవు కనుక రైతులకు ఎటువంటి భయం ఉండదు. సాగు ఆరంభంలో అయ్యే పెట్టుబడి మినహా అదనంగా పురుగు మందులు, ఎరువులు వేయాల్సిన అవసరం లేక పోవడంతో పెట్టుబడులు సైతం అధిక మొత్తంలో వెచ్చించాల్సిన అవసరం ఉండదు.

– ముత్తిరెడ్డి వెంకటసుబ్బారావు, రైతు, కిష్కిందపాలెం

**అంతరపంట సాగుతో లాభం...**



కంద సాగు చేపడుతున్న రైతులకు అదే సాగు సమయంలో మరో పంట సాగు చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుంది. కంద దుంపను వేసవి సమయంలోనే భూమిలో నాటుతున్న కారణంగా మొక్కలు మొలిచే సమయానికి ఇతర పంటల సాగుకు సమయం ఆసన్నమవుతుంది. మొక్కజొన్న, అరటి, బొప్పాయి, వంటి ఇతర పంటలను సాగు చేసుకుని లాభాలను పొందవచ్చు.

– పి. మల్లేశ్వరరావు, రైతు, పోతార్లంక

## అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు పద్మావతి**



**సంతమాగులూరు(అద్దంకి):** అంగన్‌వాడీ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండలంలోని ఏల్చూరులో రెండు, సంతమాగులూరులోని ఐదు సెంటర్లు, కామేపల్లిలో మూడు సెంటర్లను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. రెండో శనివారం సెలవు లేకపోయినా కొన్ని సెంటర్లు మూసివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీడీపీఓ, రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.



## జిల్లా జోడో కార్యవర్గం ఎన్నిక

**అద్దంకి:** బాపట్ల జిల్లా జోడో నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక భాష్యం పాఠశాలలో ఎన్నుకున్నారు. ఎన్నికకు ఏపీ జోడో సంఘ అధ్యక్షుడు ఆనం రామకిశోర్‌రెడ్డి పరిశీలకులుగా హాజరయ్యారు. నూతన కార్యవర్గ చైర్మన్‌గా చిన్న మురళీకృష్ణ, ప్రెసిడెంట్‌గా డీ వెంకటరత్నం, జనరల్ సెక్రటరీగా పీ రాంబాబు, ట్రెజరర్‌గా కే రఘునందనబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా టీటీ అమర్‌నాథ్, శ్యామ్ ప్రసాద్, పీ అయ్యప్ప, జాయింట్ సెక్రటరీగా పీ బ్రహ్మం, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, ఎస్.ఇజ్రాయేల్, జే శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ యాక్టివ్ మెంబర్లుగా సుభాని, జీ యలమందరావు, శేఖర్, ఎం.శేవతారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భావన్నారాయణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

## కొండెక్కిన కోడి..

- కిలో చికెన్ రూ.300 ● 30 గుడ్లు రూ.180
- వామ్మో అంటున్న చికెన్ ప్రియులు

**చీరాల రూరల్:** చికెన్ ధరలు పెరుగుతుండటంతో మాంసం ప్రియులు బెంబేలెత్తుతున్నారు. ఒకవైపు ఎండలు ఎడాపెడా దంచేస్తున్నాయి.. మరోవైపు కోడి మాంసం ధరలు కొండెక్కి కూర్చున్నాయి. బ్రాయిలర్ కోళ్లను ఎండవేడిమి తగలని షెడ్‌లలో ఉంచి మొక్కజొన్న, సజ్జలు వంటి ఆహారం అందించి మంచి వాతావరణంలో పెంచుతారు. కోడి మాంసం అతి తక్కువ ధరకు దొరకడమే కాకుండా కొవ్వు పదార్థాలు లేకుండా మాంసకృత్తులు అధికంగా కలిగి ఉంటాయి. వేడుకలు, పెళ్లిళ్లలో అత్యధికంగా కోడి మాంసమే వినియోగిస్తారు. ఎండాకాలంలో హోల్‌సేల్ దుకాణాల్లోనే ఏకంగా కిలో రూ.300లకు విక్రయిస్తున్నారు. అదే చిన్నచిన్న దుకాణదారులైతే ఇంకా ఎక్కువ మొత్తానికి విక్రయిస్తున్నారు. అదేమంటే ఎండలకు కోళ్లు ఎక్కువగా చనిపోతాయని, ఉన్నవాటికి అధిక వ్యయం ఖర్చుచేసి కోళ్లకు ఎండలు తగలకుండా (కూలర్లు) వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నారు. కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తున్నాయనే సమాధానం దుకాణదారులు చెబుతున్నారు. గతేడాది ఇదే ఎండాకాలంలో కిలో కోడి మాంసం రూ.200 నుంచి 220 వరకు మాత్రమే ధర ఉండేది. గుడ్ల ధరలు కూడా ఏతేడాది కంటే ఈ ఏడాది అధిక ధరలకు విక్రయిస్తున్నారు. 100 కోడి గుడ్ల ధరలు మార్కెట్లో రూ.600 విక్రయిస్తున్నారు దుకాణదారులు. మొత్తం మీద ఈ ఎండాకాలం పెరిగిన ధరలతో మాంస ప్రియులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే ధరలు తగ్గుతాయని దుకాణదారులు చెప్తున్నారు. మాంస ప్రియులు మాత్రం వర్షాలు కోసం ఎదురుచూడాల్సిందేనని నిట్టూరుస్తున్నారు.

# చంద్రబాబువి నీచ రాజకీయాలు

- దళిత మహిళ హత్యకు పూర్తిగా కుటుంబ వివాదాలే కారణం
- ఆమె కుటుంబానికి అండగా ఉంటాం
- కొండపి ఎమ్మెల్యే దుర్మార్గపు రాజకీయం
- ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

**ఒంగోలు:** దళిత మహిళ, అంగన్‌వాడీలో విధులు నిర్వహిస్తున్న హనుమాయమ్మ మృతిని అడ్డంపెట్టుకుని చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రాలు, శవరాజకీయాలతోనే సరిపోయిందని చెప్పారు. హత్యకు గురైన హనుమాయమ్మ, ఆమె మృతికి కారణమైన కొండలరావు ఇద్దరూ బంధువులే అన్నారు. 2007 నుంచి ఆ కుటుంబాల మధ్య వివాదాలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. హత్యకు పూర్తిగా కుటుంబ వివాదాలే కారణమని, అంతే తప్ప దానిని రాజకీయం చేయాలని చూడడం దారుణం అన్నారు. నిందితుడు, పోలీసులు అరెస్టు చేసిన కొండలరావుకు కనీసం ఓటు హక్కు కూడా లేదని, అయినా వైఎస్సార్ సీపీ అంటూ ప్రభుత్వంపై నింద వేయడం వెనుక చంద్రబాబు శవరాజకీయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. మరుగుదొడ్ల కుంభకోణం వ్యవహారం వెలుగులోకి రావడంతో చంద్రబాబు దిగ్భ్రాంతికి గురయ్యారని, అయితే పార్టీ ఎమ్మెల్యేను వెనకేసుకు వచ్చేందుకు నీచరాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. అవినీతిపై వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు నిరసన తెలియజేయడంతో దానిని అడ్డుకునేందుకు పచ్చ బ్యాచ్‌తో కలసి చొక్కా చించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు దాడి చేశారంటూ చెప్పుకోవడం ఒక ఎమ్మెల్యేకు తగదన్నారు. కేవలం మరుగుదొడ్ల కుంభకోణాన్ని పక్కదారి పట్టించేందుకు హనుమాయమ్మ మరణాన్ని కూడా సాకుగా వాడుకుంటున్న తీరు చూసి జనం నివ్వెరపోతున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పాలన చూసి ప్రజలు నీరాజనం పడుతుంటే దానిని చూసి ఓర్వలేక తగుదునమ్మా అంటూ పరామర్శ పేరుతో టంగుటూరు వచ్చి ప్రభుత్వంపై బురద జల్లడం అనితకు సరికాదన్నారు. హనుమాయమ్మ కుటుంబానికి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని, ఇందులో ఏమాత్రం సందేహం లేదని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ అందించే ఏ పథకం అయినా రాజకీయాలకు, మతాలకు, కులాలకు అతీతంగా చేస్తున్నారన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రి పాలనలో ఒక్కసారి అయినా కనీసం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించలేదని, కానీ నేడు కోటి రూపాయలు ఇవ్వాలంటూ డిమాండ్ చేయడం వెనుక చంద్రబాబు నీచ రాజకీయం బయటపడుతుందని ఎద్దేవా చేశారు. కుటుంబ వివాదాలను రాజకీయం చేయడం రాజకీయ నేతలకు తగదని, ఇలాగే జరిగితే వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా ఉండదని జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి అన్నారు. తమ మండలంలో మరుగుదొడ్లు ఎక్కువగా మంజూరైంది దళితులకే అని, అటువంటి పేద ప్రజానీకానికి దక్కాల్సిన మరుగుదొడ్ల నిధులను మింగి నేడు అవినీతిని తప్పించుకునేందుకు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్న డోలా బాలవీరాంజనేయస్వామిని భవిష్యత్‌లో గెలిపించుకునే పరిస్థితి ఉండదని టంగుటూరు మండలం ఆలకూరపాడు సర్పంచి ఝాన్సీరాణి విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, మహిళా నాయకురాళ్లు చింతగుంట్ల సువర్ణ, లీలాకుమారి, తూము పద్మ పాల్గొన్నారు.

## నేతన్న నేస్తం పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

**వేటపాలెం:** అర్హులైన చేతలందరూ 'నేతన్న నేస్తం' పథకానికి దరఖాస్తు చేసుకోవాలని దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ పథకానికి కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు.
ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి పాత వారికి వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుదన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి 29 మధ్యలో తాత్కాలిక అర్హుల, అనర్హుల జాబితాలు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రదర్శనలో ఉంచుతారని చెప్పారు. జూలై 6 నుంచి 7వ తేదీ మధ్యలో తుది జాబితా వెల్లడించనున్నట్లు తెలిపారు.